సాక్షి మంచిర్యాల

బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



వినూత్నంగా వీఓఏల నిరసన

జిల్లాలో వీఓఏలు తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. మంగళవారం జిల్లాలో భిక్షాటన, కళ్లకు గంతలు, వంటావార్పుతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. 9లో▸



అదనపు డీజీపీ ఆకస్మిక పర్యటన

బెటాలియన్ల అదనపు డీజీపీ స్వాతిలక్రా మంగళవారం జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. గుడిపేట బెటాలియన్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 34.0 /24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు మరో ఐదు రోజులు వర్షసూచన

బెల్లంపల్లి: అల్ప పీడన ప్రభావంతో వచ్చే ఐదు రోజులపాటు మంచిర్యాల, కుమురం భీమ్ జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురువవచ్చని, ఐదు రోజుల్లో మంచిర్యాల జిల్లాలో అత్యధికంగా 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కానుందని పేర్కొన్నారు. కుమురంభీమ్ జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని, ఐదు రోజులపాటు కురిసే వర్షాల వల్ల పంటలు పాడవకుండా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతోపాటు వడగళ్ల వర్షం కురిసే అవకాశాలు ఉండడం వల్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈదురు గాలులు.. వర్షం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రం మంచిర్యాలలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఎండగా ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులకు చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. ఇంటి రేకులు లేచిపోయి రోడ్లపై పడ్డాయి. రాత్రి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలుకాలనీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడ్డారు. ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతూ రక్షించుకునే ప్రయత్నం చేశారు.

'తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

భీమారం: తాగునీటి సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాజీ ఎంపీ వివేక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతంలో వేసవి కాలానికి ముందే గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టేవని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం అమలు చేయడం ద్వారా ఇంటింటికీ నీళ్లు వస్తున్నాయని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నిధులు వృథా అయ్యాయని, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయించడం లేదని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి బెల్లంకొండ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య దరఖాస్తులు తీసుకోండి

మంచిర్యాలటౌన్: అభాగ్యులైన పిల్లలకు ప్రతి నెలా ఆర్థిక సాయం అందించేందుకు మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులను సూపర్‌వైజర్లు, సీడీపీవోలు తీసుకుని పంపించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్‌లో మంగళవారం జిల్లాలోని సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో మిషన్ వాత్సల్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు, తల్లి/తండ్రిని కోల్పోయిన పిల్లలకు రూ.4 వేల చొప్పున ప్రతి నెలా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. జిల్లాలోని అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డవారు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన వారు, హెచ్‌ఐవీ బాధిత బాలల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, సీడీపీవోలు హేమసత్య, ఉమ, స్వరూప పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంచిర్యాలలో ఇంటర్ పరీక్షల కోసం 5, పదో తరగతికి 2, బెల్లంపల్లిలో ఇంటర్ 2, పదో తరగతికి 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతిలో 1,236 మంది విద్యార్థులకు గాను 1076 మంది పరీక్షలకు హాజరుకాగా 160 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 633 మందికి గాను 559 మంది హాజరుకాగా 74 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు డీఈవో తెలిపారు.

పగబట్టి.. ప్రాణం తీసి..!

మంగళవారం ఉదయం సుమారు 8.20గంటలు..
జైపూర్ మండలం ఇందారం గ్రామం..

ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. గ్రామానికి చెందిన ముస్కె మహేశ్(27) మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. అతడిపై కక్ష పెంచుకున్న కుటుంబం నడిరోడ్డుపై అడ్డుకున్నారు. అందరూ చూస్తుండగానే నలుగురు కలిసి కత్తి, ఇటుక, బండరాయితో మహేశ్ తలపై బాదుతూ విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో అప్పటి దాకా ప్రశాంతంగా గ్రామంలో ఒక్కసారిగా అలజడి రేగింది. తీవ్ర రక్తస్రావంతో ఆ యువకుడు కొద్ది సేపటికే అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. దాడి జరుగుతున్న సమయంలో అక్కడున్న వారు ఎవరూ అడ్డుచెప్పలేదు. అనంతరం దాడి చేసిన నలుగురు ఓ ఆటోలో ఎక్కి మంచిర్యాల వైపు పారిపోయారు. దాడి దృశ్యాలను ఆ సమయంలో అక్కడున్న వారు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో జిల్లా వ్యాప్తంగా వైరల్‌గా మారింది.



అందరూ చూస్తుండగానే యువకుడిపై దాడి చేస్తున్న దృశ్యం

- మనుషుల ప్రాణాలు తీస్తున్న పగలు
- జిల్లాలో ఈ నెలలోనే రెండు హత్యలు
- వ్యక్తుల్లో పెరుగుతున్న విపరీత ధోరణి

- ఈ నెల 11న ఉదయం 11.15గంటలకు మందమర్రి మండలం రామక్రిష్టాపూర్ పరిధి గద్దెరాగిడిలోని దాకలివాడలో రియల్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు(63) దారుణంగా హత్యకు గురయ్యాడు. భూ వివాదాల కారణంగా ఈ హత్య జరిగింది. పలు భూ వివాదాలు ఉండడంతో ప్రత్యర్థులు పక్కా ప్లాన్ వేసి చంపేశారు.
- గత డిసెంబర్ 16న మందమర్రి మండలం గుడిపల్లి శివారు వెంకటాపూర్‌లో ఇంటికి నిప్పు పెట్టిన ఘటనలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. ఇందులో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు సైతం కాలి బూడిదయ్యారు. తన భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడనే కోపంతో మహిళ మరో ఇద్దరితో కలిసి పక్కాప్లాన్‌తో దాడి చేసి చంపింది. ఈ ఘటన అప్పట్లో జిల్లాలో సంచలనం రేపింది. ఒక్కరిపై కోపంతో మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.



కొడుకు మరణంతో రోదిస్తున్న తల్లి రాజేశ్వరి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. పలు వివాదాలు, భూ తగాదాలు కక్షలతో ఏకంగా మనుషుల ప్రాణాలే తీస్తున్నాయి. తాజాగా ఇందారం గ్రామంలో జరిగిన ఘటనలో యువతీ, యువకుల ప్రేమ వ్యవహారం.. విభేదాలే కారణం. ఇందారం గ్రామం నజీర్‌పల్లికి చెందిన ముస్కె మహేశ్, ఇదే గ్రామానికి చెందిన పెద్దపల్లి శృతి చదువుకునే రోజుల్లో ప్రేమించుకున్నారు. పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో శృతి సీసీసీకి చెందిన పెంట శివను పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత కూడా మహేశ్, శృతి మధ్య సంబంధం కొనసాగడం, ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో అటు భర్త కుటుంబం, ఇటు యువతి కుటుంబంలో చిచ్చురేపింది. భార్య తీరుతో భర్త శివ కలత చెంది విడాకులు ఇచ్చాడు. ఆ తర్వాత అతడు ఆత్మహత్య చేసుకోవడం వారి ఇంట విషాదాన్ని నింపింది. ఇటు శృతి పుట్టింటికి చేరింది. పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు కావడం, వేధింపులు పెరగడంతో యువతి కుటుంబం పగ పెంచుకుంది. తెలిసీ, తెలియక చేసిన తప్పులతో అనేక కుటుంబాల్లో ఘర్షణకు దారి తీస్తున్నాయి.

కక్షలతో రగిలిపోతూ..

ఇటీవల జరిగిన ఘటనలతో గొడవలు ఏవైనా కక్షలతో రగిలిపోతూ చంపేవరకు సాహసం చేస్తున్నారు. తర్వాత జరిగే పరిణామాలను లెక్కచేయడం లేదు. అనంతరం జైలు పాలవుతున్నారు. ఆవేశంలో చేసే తప్పులతో ఎంతోమంది కుటుంబాల్లో తీరని నష్టం చేకూరుస్తోంది. తర్వాత న్యాయస్థానాలు, జైలు జీవితం గడుపుతున్నారు. దీంతో తమ పిల్లల భవిష్యత్తుపైనా ప్రభావం పడుతోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది.

పంట నష్టంపై నివేదిక ఇవ్వాలి

- గత నెల 22 నుంచి ఈ నెల 24 వరకు గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు, పంటల నష్టం వివరాలపై నివేదిక అందజేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ.ప్రేమ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ, విస్తరణ, ఉద్యానవన శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ మార్చి 22 నుంచి ఏప్రిల్ 24వరకు జరిగిన నష్టంపై నివేదిక రూపొందించాలని, జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా 1,625 మంది రైతులు 2,379 ఎకరాల్లో పంట నష్టపోయారని, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించి ఈ నెల 30లోగా పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పంట నష్టం, రైతుల వివరాలు అందజేయాలని, నష్టపోయిన రైతు ఖాతాలో నేరుగా పరిహారం జమ చేస్తామని తెలిపారు. మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు తేమ, తాలు, మట్టిగడ్డలు లేకుండా ధాన్యం తరలించేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగ రైతులు కొనుగోలు కేంద్రాలకు రాలేని సమయంలో తమ సహాయకులను పంపే విధంగా ప్రత్యామ్నాయం కల్పించడంతోపాటు వారే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా ఉన్నట్లయితే ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వాహనాల తాకిడి అధికంగా ఉంటుందని, కేంద్రాలకు రావాల్సిన తేదీ, సమయం టోకెన్లు జారీ చేయాలని, ఆ ప్రకారంగా కొనుగోలు కేంద్రాలకు రావాలని రైతులకు తెలియజేయాలని తెలిపారు.

బీఆర్ఎస్ జయకేతనం తథ్యం



మాట్లాడుతున్న ఎంపీ వెంకటేష్ నేత, పక్కన ఎమ్మెల్యే చిన్నయ్య

- పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత
- బెల్లంపల్లిలో పార్టీ ప్రజాప్రతినిధుల సభ

బెల్లంపల్లి: దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ జయకేతనం తథ్యమని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని తిరుమల హిల్స్ ఆర్పీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష అని, పార్టీ పటిష్టంగా ఉంటేనే నాయకులు, కార్యకర్తలు బాగుంటారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయని, దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు కాలం చెల్లుతోందని, సమీప భవిష్యత్‌లో దేశంలో గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని అన్నారు. ముచ్చటగా మూడోసారి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్యను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని శ్రేణులకు సూచించారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణం, కార్యకర్తల బలం బీఆర్ఎస్‌కు కొండంత అండ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన బీఆర్ఎస్ క్రమక్రమంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తోందని అన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ పట్ల ప్రతి ఒక్కరూ నిబద్ధతను కలిగి ఉండాలని అన్నారు. వచ్చే ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపు సాధించే వరకు ప్రతీ ఒక్క కార్యకర్త విశ్రమించవద్దని కోరారు. ఈ సభలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, ఏఎంసీ డైరెక్టర్లు, నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కోఆప్షన్ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతుబంధు సమితి అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు పరిష్కార మార్గం కాదు..

- ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సత్తయ్య
- గుడిపేటలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న జడ్జి బత్తుల సత్తయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుల సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కార మార్గం కాదని మంచిర్యాల ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి.సత్తయ్య అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ రైతువేదికలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులు చైతన్యంతో సాగు చేస్తుండడంతో విస్తీర్ణం పెరిగిందని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు ఇంకా నష్టాలు చూడడం బాధాకరమని అన్నారు. మోసాలకు గురికాకుండా చైతన్యంతో హక్కులను పోరాడి సాధించుకోవాలని, వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన మాట్లాడుతూ గుడిపేట, సీతారాంపల్లిలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇక రైతులు నష్టాల బారిన పడకుండా నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌తో కలిసి ఆకస్మిక దాడులు చేయనున్నట్లు తెలిపారు. భూ తగాదాలు, పంట సాగు, మార్కెటింగ్‌లో అవసరమైన సలహాల కోసం కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, మంచిర్యాల కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, ఏడీఏలు అనిత, ఇంతియాజ్ అహ్మద్, ఏఓ రజిత, న్యాయ సేవా కేంద్రం సూపరింటెండెంట్ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగలా మార్చిన కేసీఆర్

- చెన్నూర్‌కు ప్రాతినిధ్యం వహించడం నా అదృష్టం
- గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చాం
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తున్న విప్ సుమన్, మాజీ ఎమ్మెల్సీ సతీశ్, నాయకులు

చెన్నూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహించినా తెలంగాణ చుక్క నీరు రాలే.. పెట్టుబడి సహాయం ఇచ్చేవాళ్లు లేకుండే.. పండించిన పంటలను కొనుగోలు చేయక రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.. నాడు వ్యవసాయం దండగా అన్న పరిస్థితులను ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగల మార్చారని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభ నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించి, పార్టీ జెండాను ఎగరవేశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర, నియోజకవర్గ తీర్మానాలు 20 ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ సుమన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వత ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. గత తొమ్మిదేళ్లలో తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. కొందరు పల్లెలు, పట్టణాల్లో ఉద్యోగాలు భర్తీ చేయలేదని ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధులు ఇలాంటి ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చెన్నూర్ నియోజకవర్గానికి సేవ చేసే అవకాశాన్ని అధిష్టానం కల్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి మూడు లిఫ్టుల ద్వారా చెన్నూర్ నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగు నీరందించేందుకు సీఎం కేసీఆర్ రూ.1658 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే కేసీఆర్ చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని అన్నారు. భీమారంలో గిరిజన భవన్ నిర్మాణానికి గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ రూ.2 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా నాయకుడు పాల శ్రీనివాస్‌రావు, ఎంపీపీ బాపు, జెడ్పీటీసీలు మోతె తిరుపతి, రాజ్‌కుమార్‌నాయక్, రైతుబంధు అధ్యక్షుడు రత్న సమ్మిరెడ్డి, బాపురెడ్డి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల పోరు షురూ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) ప్రొబేషనరీ కాలం ముగిసింది. క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తుండగా నిరాశే ఎదురైంది. ఈ నెల 28లోగా ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రానిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల ముందుగానే పోరు షురూ చేశారు.

జిల్లాలో 218 మంది జేపీఎస్‌లు

జిల్లాలో 218 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులతోపాటు అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు(ఓపీఎస్) 41 మంది, 51 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. క్రమబద్ధీకరణ పోరులో భాగంగా మంగళవారం జేపీఎస్, ఓపీఎస్‌లు 258 మంది తమ మొబైల్ ఫోన్ నుంచి డీఎస్ఆర్ యాప్‌ను డిలీట్ చేసి నిరసన ప్రారంభించారు. రోజు వారీ కార్యక్రమాలను డీఎస్ఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈ సమయంలో యాప్‌ను డిలీట్ చేసి పోరు సంకేతం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 26న బుధవారం కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీవో, ఎంపీడీవోలతో అధికారికంగా ఉన్న వాట్సాప్ గ్రూపు నుంచి తొలగిపోనున్నట్లు జేపీఎస్‌లు తేల్చిచెప్పారు. 27న గురువారం జిల్లాలోని సమస్త జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. ఏదేమైనా ఈ నెల 28లోగా ప్రభుత్వం నుంచి క్రమబద్ధీకరణ ప్రకటన రానిపక్షంలో సమ్మె ఉధృతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు సమర శంఖారావం

- మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే
- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రేపటి ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ సమరశంఖారావం పూరిస్తోందని, మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జోస్యం చెప్పారు. మంగళవారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని పద్మావతిగార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ నిర్వహించారు. పార్టీ పతాకాన్ని దివాకర్‌రావు ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహం, అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలతోపాటు రైతాంగానికి ఎంతో మేలు జరిగిందని చెప్పారు. వ్యవసాయ, ఆరోగ్య, సంక్షేమ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ పార్టీ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారాయని, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా మనుగడ సాధించలేరని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడి సభ జనాలు లేక వెలవెలబోయిందని, ప్రజల్లో ఆ పార్టీకి ఎంత ఆదరణ ఉందో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. బీజేపీ దేశాభివృద్ధిని విస్మరిస్తూ కార్పొరేట్‌కు వత్తాసు పలుకుతోందని, దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు. సభలో పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి బలపర్చారు. డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్‌లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, ప్రభాకర్, వైస్ చైర్మన్‌లు ముఖేశ్‌గౌడ్, తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పల్లె భూమేశ్, సాగి వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు మందపల్లి శ్రీనివాస్, పూస్కూరి శ్రీనివాసరావు, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, సుదమల్ల హరికృష్ణ, గాదె సత్యం, అరె శ్రీనివాస్, పడాల రవి, మొగిళి శ్రీనివాస్, జిల్లా, మండల, పట్టణ బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపడి ఎడ్లు మృతి

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు రైతు బండ పోచయ్యకు చెందిన రెండు ఎడ్లు మృతి చెందాయి. సుమారు రూ.60వేల నష్టం వాటి ల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదు కోవాలని కోరాడు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



హరన్ మండల్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌న గర్ విలేజ్ నంబర్–5 గ్రామానికి చెందిన హరన్ మండల్ (54) మంగళవారం ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈస్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్ 14 ఏళ్లుగా విలేజ్ నంబర్–5 శివారులోని సొసైటీకి సంబంధించిన చేపల చెరువును వేలంలో దక్కించుకుంటూ జీవనోపాధి పొందుతు న్నాడు. ఈ ఏడాది వేలంలో చెరువు తనకు దక్కకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు విక్రం మండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంటల పరిశీలన



ముత్తరావుపల్లి గ్రామంలో వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర, ముత్తరావుపల్లి గ్రామాల్లో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు వరి క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వరి సాగులో పాటించాల్సిన పద్ధతులు వివరిం చారు. చీడ, పీడల నివారణ చర్యల గురించి తెలిపారు. ఆయిల్‌పాం పంటను పరిశీలించి సాగు ప్రాముఖ్యతను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్, ఏడీఏ బాడి బాపు, ఏవో కవిత, వ్యవసాయ శాస్త్రవేత్త లు నాగరాజు, తిరుపతి, ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర మూడో మహాస భల పోస్టర్‌ను సేనా మంచిర్యాల జిల్లా అధ్య క్షుడు కోట్నాక తిరుపతి వందుర్‌గూడలో ఆవిష్కరించారు. ఎస్టీ జాబితాలో మరో 11 కులాలను చేర్చాలనుకునే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మహాస భకు ఆదివాసీ నాయకులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కార్మికుల ఆరోగ్యానికి భరోసా

- కార్మిక సంక్షేమబోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షల శిబిరాలు
- భవన, ఇతర నిర్మాణరంగ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఉచితంగా 50 రకాల పరీక్షలు



కార్మికుల నుంచి రక్త నమూనాలు తీసుకుంటున్న వెల్‌నెస్ సంస్థ వైద్యసిబ్బంది (ఫైల్)

పాతమంచిర్యాల: తెలంగాణ నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో కార్మికులకు రాష్ట్ర ప్రభు త్వం ఉచిత వైద్యం అందించేందుకు రెండు నెలల క్రితం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్మికశాఖ ద్వారా లేబర్ గుర్తింపుకార్డు పొందిన కార్మికులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులు గుర్తించడానికి 50 రకాల పరీక్ష లు నిర్వహిస్తోంది. వైద్యపరీక్షలు చేయించుకున్న కార్మికులకు రిపోర్టుల ఆధారంగా ఏదైన వ్యాధి లేదా దీర్ఘకాలిక వ్యాధులున్నట్లు నిర్ధారణ జరిగితే వారికి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అం దిస్తారు. జిల్లాలోని 3,012 మంది లేబర్ కార్డులు పొందిన కార్మికులకు ఈ సేవలు అందించనున్నట్లు కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఏఎస్ వినీత తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగు తుందని, లేబర్‌కార్డు కలిగిన ప్రతీ కార్మికుడు సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

ఇప్పటికే మంచిర్యాల మండలంలో..

జిల్లాలో ఇప్పటికే మంచిర్యాల మండల పరిధిలోని కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామా లు, మండల కేంద్రాల్లోనూ వైద్యపరీక్షలు నిర్వహిం చేందుకు శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలన్నదే కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే వైద్యప రీక్షల శిబిరాలకు రాని వారి ఇంటికే వెళ్లి వైద్యపరీక్ష లు నిర్వహించనున్నట్లు కార్మికశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు, కామన్ సర్వీస్ సెంటర్ వెల్‌నె స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్మికశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. వైద్యపరీక్షల శిబిరాల్లో భవన నిర్మాణ సం ఘాలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పెయింటింగ్ కార్మిక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తు న్నారు. కార్మికులకు ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్నా వైద్యపరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగు తుందని, దీంతో సకాలంలో చికిత్స తీసుకుంటే ప్రాణాంతకం కాకుండా నిరోధించుకోవచ్చని అధికారులు తెలిపారు.

శిబిరాల్లో చేసే పరీక్షలివే..

వైద్యపరీక్షల శిబిరాల్లో కార్మికులకు అవసరమైన ప్రధాన టెస్టులన్నీ చేస్తారు. లంగ్‌ఫంక్షన్, ఆడియో స్క్రీనింగ్, విజన్‌స్క్రీనింగ్, బ్లడ్‌షుగర్, లివర్‌ఫంక్షన్, రీనల్ ఫంక్షన్ మూత్రపిండాల పనితీరు, లిపిడ్‌ప్రొ ఫైల్, యూరిన్, ఈఎస్సార్, థైరాయిడ్, జీజీటీపీ, హెచ్‌బీవీ, హెపటైటిస్ బీ, సీవీడీఆర్‌ఎల్, బ్లడ్‌గ్రూ పింగ్, విటమిన్ డీ 3, హెచ్‌బీఏ 1సీ, ఈసీజీ, కార్సిని యో ఎంబ్రోయినిక్ ఆంటిజెన్ (సీఈఏ) తదితర పరీక్షలు చేస్తారు.

మే 1, 2, 3 తేదీల్లో శిబిరాలు

కార్మికులకు ఆరోగ్య సమస్య వస్తే ప్రైవేట్ ఆస్ప త్రులకు వెళ్లి వివిధ రకాల టెస్టులు చేయించుకుని ఖర్చుల పాలై ఆర్థికంగా నష్టపోతున్నారని గుర్తిం చిన రాష్ట్ర ప్రభుత్వం భవన, ఇతర నిర్మాణరంగ కార్మిక సంక్షేమబోర్డు ఆధ్వర్యంలో ఉచితంగా 50 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇవే పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌ల్లో చేసుకుంటే రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని కార్మికశాఖ అధికారులు పేర్కొన్నారు. మే 1, 2, 3 తేదీల్లో మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, లక్సె ట్టిపేట, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసి ఫాబాద్, కాగజ్‌నగర్‌లో మెగా వైద్యపరీక్షల శిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కామన్ సర్వీస్‌సెంటర్ వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ రాజు తెలిపారు. లేబర్ కార్డు కలిగిన ప్రతీ కార్మికుడు వైద్యపరీక్షలు చేయించు కోవాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి



లేబర్‌కార్డు కలిగిన ప్రతీ నిర్మాణరంగ కార్మికుడు ప్రభుత్వం ఉచితంగా నిర్వ హించే శిబిరాల్లో వైద్యపరీక్ష లు చేయించుకుని రిపోర్టు లు పొందాలి. ప్రతీ కార్మికుడు తన ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలి. – వినీత, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, మంచిర్యాల

గని మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ



లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజేందర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గని మేనేజర్‌గా మంగళవారం జీ లక్ష్మీనారాయ ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్ లక్ష్మీనారాయ ణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గని అధికారులు, కార్మికులు స్వాగతం పలికారు. మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారిగా బదిలీపై వెళ్తున్న మేనేజర్ రవీంద ర్‌ను అధికారులు, కార్మికులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ ఇంజినీర్లు రఘు, నందకిశోర్, సంక్షేమాధికారి భార్గవ్, సర్వే అధికారి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు ఐఎఫ్‌టీయూ మద్దతు

పాతమంచిర్యాల: విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు ఐఎఫ్‌టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఆర్టిజన్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తే వారిపై ఎస్మా ప్రయో గించడం అన్యాయమని పేర్కొన్నారు. డిమాం డ్లు పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేయడం, ఎస్మా ప్రయోగించడం మాను కోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో రెండోవిడత గొర్రెల పంపిణీ



రికార్డులు పరిశీలిస్తున్న రమేశ్‌కుమార్

నెన్నెల: ప్రభుత్వం త్వరలో రెండోవిడత గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనుందని, ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. మం గళవారం నెన్నెల పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండలం లో 216 మంది గొర్రెల పెంపకందారులు రెండో విడత గొర్రెల కోసం వాటాధనం చెల్లించాల్సి ఉం దని తెలిపారు. లబ్ధిదారులు ఆధార్, నామినీ ఆధా ర్, బ్యాంక్ పాస్‌పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు జత చేసిన దరఖాస్తులను పశువైద్యాధికారులకు వెం టనే అందజేసి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు వాటా ధనం కింద రూ.43,750 నేరు గా తమ ఖాతాల నుంచి కలెక్టర్ ఖాతాలో జమ చేయాలని తెలిపారు. లబ్ధిదారుల వాటాకు ప్రభు త్వం రూ.1,31,250 సబ్సిడీ వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు రెండో విడత లక్ష్యం 4,138 యూనిట్లు కేటాయించినట్లు చెప్పారు. గొల్ల, కుర్మ లు ఆరోగ్యకరమైన గొర్రెలు ఎంపిక చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. వేసవిలో జీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుం డా తీసుకోవాల్సిన జాగ్రత్తలను లబ్ధిదారులకు వివ రించారు. రమేశ్‌కుమార్ వెంట పశువైద్యాధికారి దిలీప్, సిబ్బంది ఉన్నారు.

6,913వ రోజుకు డిస్మిసల్ కార్మికుల దీక్ష




మాట్లాడుతున్న సంఘం అధ్యక్షురాలు రాధిక

మందమర్రిరూరల్: ఉద్యోగాలు కల్పించాలని మంద మర్రి జీఎం ఆఫీస్ సమీపంలో డిస్మిసల్ కార్మికులు చేపట్టిన దీక్ష మంగళవారం 6,913వ రోజుకు చేరిం ది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన డిస్మిసల్ కార్మిక సం ఘం అధ్యక్షురాలు రామిళ్ల రాధిక వారికి సంఘీ భావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. డిస్మిసల్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించే వరకూ ఆందోళనలు, దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో డిస్మిసల్ కార్మికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత విస్మరించారని విమర్శించారు. త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు రూపొందిస్తామని, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిస్మిసల్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మట్టిదిబ్బల కింద మహాచరిత్ర

- మురిమడుగు గుట్టపై నేటికీ దర్శనమిస్తున్న 15వ శతాబ్దపు గుడి
- ఈ ప్రాంతాన్ని తొలి శాతవాహనులు ఏలినట్లు లభ్యమైన ఆనవాళ్లు
- ప్రముఖ చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ పరిశోధనలో వెల్లడి



గుట్టపై 15వ శతాబ్దపు నాటి రోలు



మురిమడుగు గుట్టపై పురాతన ఆలయం

జన్నారం: మట్టి దిబ్బల కింద మహాచరిత్ర దాగి ఉం ది. తొలి శాతవాహనులు ఏలినట్లు ఇక్కడి ఆనవాళ్లు చెబుతున్నాయి. 15 శతాబ్దంలో నిర్మించిన శివాలయం నేటికీ దర్శనమిస్తోంది. మంగళవారం ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవ రావు ఆ ప్రాంతంలో పర్యటించి చరిత్ర ఆనవాళ్లు న్నట్లు ప్రకటించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం లోని కొండపై శాతవాహనులు ఏలినట్లు, 250 ఫీట్ల ఎత్తున, 30 ఫీట్ల వెడల్పుతో కోట ఏర్పాటు చేసుకుని పాలన సాగించినట్లు ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కొండపై పురాతన శివాలయం ఇప్పటికీ ఉంది. సుమారు 2,500 ఏళ్ల క్రితం శాతవాహన రాజులు ఈ కోటను కేంద్రంగా చేసుకుని పాలించినట్లు తెలుస్తోం ది. కోట లోపల గృహోపకరణాలు, పునాదులు, రాతి పనిముట్లు కనిపించాయి. కోట ప్రవేశ ద్వారం పై బౌద్ధస్తూపాన్ని పోలిన నిర్మాణాలున్నాయి. లోపల స్నానపు బావులు, నీటి బావుల అవశేషాలు కనిపిస్తున్నాయి. బావికి కాల్చిన మట్టితో చేసిన రిం గులు వేసినట్లు ఉంది. నలుపు, ఎరుపు కుండ పెంకు లు ఎక్కువగా ఉన్నాయి. మట్టిపూసలు, రాతి పలక లపై పూల డిజైన్లు, ఇటుకలు, ఇసురురాళ్లు, గాజు ముక్కలు, ఎముకలు, నూరు రాళ్లు, బలపపు రాళ్లు లాంటి అవశేషాలు లభించాయి.

15వ శతాబ్దపు శివాలయం

15 శతాబ్దంలో ఇక్కడి నుంచి పాలించిన శాత వాహన రాజుల కాలంలో నిర్మించిన శివాలయం నేటికీ ఉంది. బండరాళ్లతో నిర్మించిన ఇది శిథిలమైం ది. ఇక్కడ ఏటా దీపావళి సందర్భంగా ఆదివాసీలు పూజలు చేసి దండారీ ఆడతారు. ఇప్పటికీ బోరమ్మ విగ్రహం ఆదివాసీల పూజలందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విగ్రహం జైన యక్షినిని పోలి ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తూర్పున తాళ్ల చెరువు, ఉత్తరాన గుండు చెరువు, కోట చుట్టూ 80 ఫీట్ల లోతుతో నీటి కందకాలు ఉన్నాయి. వీటిని పరిశీలిస్తే శత్రువుల బెడదతో ఈ కోటను రక్షణ స్థావ రంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

గోదావరి చుట్టూ బౌద్ధ నాగరికత

గోదావరికి సమీప ప్రాంతాలైన బాసర, కోటిలింగా ల, బ్రహ్మేశ్వర్, బాదన్‌కుర్తి, దిలావర్‌పూర్ లాంటి బౌద్ధక్షేత్రాలను పోలిన బౌద్ధ నాగరికత మురిమడు గు గుట్టపై కనిపిస్తోందని చరిత్ర పరిశోధకుడు తు మ్మల దేవరావు పేర్కొన్నారు. కోటిలింగాల క్షేత్రం వద్ద లభించిన పంచమార్కుడి నాణేల లాంటి అవశే షాలు ఇక్కడా లభించినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ దృష్టి సారిస్తే మురిమడుగు గ్రామ శివారులోని గుట్టపై మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవ కాశముందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

పురావస్తుశాఖ దృష్టికి తీసుకెళ్తా



మురిమడుగు గ్రామ సమీప అటవీ ప్రాంతం లోని గుట్టపై శాతవాహను లు ఏలిన అనేక అవశేషాలు కనిపించాయి. గుట్టను కేం ద్రంగా చేసుకుని పాలన కొనసాగించినట్లు తెలుస్తోంది. నేటికీ శివాలయం, బావులు, రుబ్బురోళ్లు కనిపిస్తు న్నాయి. అవశేషాలు కాలగర్భంలో కలవక ముందే అధికారులు స్పందించి తవ్వకాలు చేప డితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవ కాశముంది. పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. అద్భుతమైన కళాసంపదకు నిలయం గా ఉన్న మురిమడుగు గుట్టపై పరిశోధనలు జరపాలి. – తుమ్మల దేవరావు, కవి, చరిత్ర పరిశోధకుడు

గోలేటి సీహెచ్‌పీకి అవార్డు



డైరెక్టర్ నుంచి అవార్డు తీసుకుంటున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. మం గళవారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్య నారాయణరావు ఉత్తమ సీహెచ్‌పీగా ప్రకటించడం తో పాటు అవార్డు అందజేశారు. డైరెక్టర్లు గోలేటి సీహెచ్‌పీ నిర్వహణను పరిశీలించారు. వినియోగ దారుడికి నాణ్యమైన బొగ్గు అందజేసేలా, ఉత్తమ డిస్పాచ్, రక్షణతో కూడిన నిర్వహణ, పచ్చదనంతో కూడిన పరిశుభ్రత, డీజీఎంఎస్ నిబంధనలకు అను గుణంగా ఏరియా, సీహెచ్‌పీ అధికారులు దీనిని నిర్వహించడంతో అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమేరకు కొత్తగూడెంలో జరిగిన కార్యక్ర మంలో డైరెక్టర్ సత్యనారాయణరావు చేతుల మీదు గా ఏరియా ఏజీఎం తిరుమలరావు, సీహెచ్‌పీ ఇం జినీర్ రాజు, డీజీఎం సతీశ్‌బాబు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

అన్‌ఫిట్ అయినవారికి సూటబుల్ జాబ్ ఇవ్వాలి



డైరెక్టర్ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో అన్‌ఫిట్ అయిన వారికి సర్వే స్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని ఏఐటీయూసీ నబ్ కమిటీ మైనింగ్ స్టాఫ్ నాయకులు కోరారు. మంగళ వారం వారు డైరెక్టర్ బలరాంను కలిసి డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేటీకే 8 ఇంక్‌లైన్‌లో జరిగిన గని ప్రమాదానికి ప్రకాశ్ అనే మైనింగ్ సర్దార్‌ని బాధ్యుడిని చేస్తూ డిస్మిస్ చేసిన యాజమాన్యం అతడిని తిరిగి విధుల్లోకి తీసుకొని సూటబుల్ జాబ్ కల్పించాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓవర్‌మ న్లకు కౌన్సెలింగ్ ద్వారా ఓపెన్ కాస్టులలో విధులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సబ్ కమిటీ బెల్లంపల్లి ఏరియా రీజియన్ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి వంగరి రాజేశ్వర్‌రావు, మందమర్రి ఏరియా ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, శ్రీరాం పూర్ మారపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరర్ ఏడీని కలిసిన కమిషనర్



ట్రెజరీ ఏడీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా ట్రెజరీ అసి స్టెంట్ డైరెక్టర్ సంజయ్‌కుమార్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ కలిశారు. పెండింగు బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మారుతీప్రసాద్, మున్సిపాలిటీలోని ఉద్యోగుల సప్లి మెంటరీ బిల్లులతో పాటు, వివిధ పనులకు సంబం ధించిన బిల్లులు ఆలస్యం కావడంపై ఏడీకి వివరిం చి, సకాలంలో అందించేలా చూడాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ కే విజయ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియాస్పత్రిని పరిశీలించిన డైరెక్టర్



పేషెంట్లతో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సింగరే ణి ఏరియా ఆస్పత్రిని సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) మంగళవారం సందర్శించారు. అన్ని వార్డులు తిరిగి రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా అసౌకర్యం కలగకుండా చూడాలని వైద్యులకు సూచిం చారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా.. తెలుసుకున్నారు. ఇన్‌చార్జి జీఎం మధుసూదన్, ఎస్వోటూ జీఎం ఓదెలు, డీవైసీఎంవో ఉషారాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎస్జీటీలు, పీఈటీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పండితులు, పీఈటీలు, మిగిలిపో యిన ఎస్‌ఏలు, స్పౌస్ బదిలీలు తదితర సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళ వారం ఎస్జీటీలు, పీఈటీలు కలెక్టర్‌కు వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్పౌస్ బదిలీల ఉత్తర్వులు వెలువడేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిం గరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూ సీ) నాయకులు, కార్మికులతో కలిసి శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రా న్ని జీఎం సంజీవరెడ్డికి అందించారు. ఈ సందర్భం గా సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మికులకు వెం టనే సీఎంపీఎఫ్ చిట్టీలు పంపిణీ చేయాలన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో అమలు చేయాలని కోరారు. కార్మికులకు హాస్పిటల్ బుక్ ఇచ్చి కార్మికుడితోపాటు కుటుంబ సభ్యులకు కూడా ఇన్ పేషెంట్‌గా వైద్యసౌ కర్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాం ట్రాక్ట్ వర్కర్స్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్ అలీ, ప్రధాన కార్యదర్శి వైవీరావు, ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, నాయకులు బాజీ సైదా, వీరభ ద్రయ్య, మోతుకూరి కొమురయ్య, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న సుబ్బారాయుడు

నస్పూర్: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బా రాయుడు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలే రియా దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని షిర్కే కాలనీలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా నివారణకు దోమలు పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, అధికారులు అల్లాడి శ్రీధర్, నాందేవ్, దత్తు, నస్పూర్ మెడికల్ ఆఫీసర్ నమత పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ రహదారుల పను లు త్వరగా పూర్తి చేయాలని రవాణా, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర బోయి ఆదేశించారు. మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ రహదారుల నిర్మాణ పనులపై కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ.. జాతీయ రహదారుల పనులను పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. అటవీ, పర్యావరణ అనుమతులు పొందడంలో తలె త్తిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో జాతీయ రహ దారి 363 నిర్మాణంలో 44,200 కిలోమీటర్ల మేర మంచిర్యాల నుంచి రేపల్లెవాడ, జాతీయ రహ దారి–63 నిర్మాణంలో 36.252 కిలోమీటర్ల మేర మంచిర్యాల నుంచి నిజామాబాద్ రహదారి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.